# పసులగాసే పిల్లగాడా !

సంకురాతిరికల్లా దిబ్బ నిండా ప్యాడ యేస్తే కొత్తనిక్కరూ, సొక్కాగాక కయలటువాల[1] గూడా తెస్తానని బాలమ్మ సెప్పిన కాన్నుంచీ సెన్నుగాడు తెల్లవార్జామున్నే లేసి ప్యాడ ఏయడం మొదలుపెట్నాడు. సలిసలిగా. కటి సీకటిగా వుండే ఆ జామున ప్యాడ కోసం తిరిగేతప్పుడు సెప్పుల్లేని పాదాలకు రాళ్ళు కొట్టుకుంటే 'అమ్మా!' అని యెన్నోమాట్లు అర్సినాడు. రాళ్ళు తగిల్న దెబ్బకు నెత్తురు గూడుకట్టినా, ఏళ్ళు నలిగినా ఆ సలుపు కొన్ని రోజులుంటాది. సీకట్లో తుమ్మల బీట్లో తిరిగేతప్పుడు రొండు కాళ్ళల్లో ముల్లులు దిగినాయి. అందుకే యీ నడమ వాడు కాళ్లు ఎత్తెత్తి యేస్తా నడుస్తా వుండాడు.

సీకట్లో తుమ్మల బీట్లోకి పోకుండా వొలకల్లోకి[2] పోదామంటే అదింగో బయం. పగలు పసుల్జీతగాళ్ళు వొలకల్లో దయ్యాల కతలు సెప్పుకోవడం మతికొచ్చి బయమేస్తాది. ఇంతగా బయపడ్తానే వాడు ప్యాడ యేస్తా వుండాడు. నెత్తిన ప్యాడగంప బరువున్నా, బాలమ్మ సెప్పిన మాట గ్యాపకం వస్తానే వుంటాది. సొక్కా ఎట్టుంటాదో, నిక్కరెట్టుంటాదో ! కయల టువాలంటే నల్లకయల్దా ? ఎర్రకయల్దా ? సెంగల్‌రెడ్డి కొడుకేసుకుంటాడే, అట్టాటిదా ? అట్టాటిదయితే దానికి ప్యాడ అయితే ఎట్టా ? ప్యాడ గంప కిందికి యీ పాత తుండే తెచ్చుకోవాల.

బాలమ్మ తనకు కొత్త సొక్కా నిక్కరూ టువాల తెస్తానన్న సంగతి ఏట్లోకి పసులను తోలకపోయినప్పుడు బుడంకాయగానికీ, సీమిడోనికీ సెప్పినాడు. బుడంకాయగాడు ఎగతాళిజేసినాడు. ప్యాడ బాగా యేయిచ్చుకోడానికని అట్టా సెప్తారంటాడు వాడు. వాడు దొంగనాయాలు ! వాని మాటలు నమ్మగూడదు. ఏ పొద్దూ గంపనిండా ప్యాడ యేయడు వాడు. సగం గంపకు తంగిడాకు యేసుకోని పైన బోలు బోలుగా ప్యాడ యేసుకొని పోతాడు. తెల్లవార్జామున వచ్చినా వాడు ప్యాడ యేయడు. "ఈ సీకట్లో ముల్లులు తొక్కుకుంటా ప్యాడ యేయాలా ? ఏమంత సావు మనకు ?" అని పండుకొని నిద్రబోతాడు.

తెల్లవారి అందరూ గంపల నిండా ప్యాడ యేసుకొని పోతాంటే తన ఉత్త గంప సూసుకొని అప్పుడు "ప్యాడకళ్ళు సై... గోలి గుండ్లు ఆడదాంరండర్రా" అని పిల్సుతాడు. వాడు గోలిగుండ్లు బలే ఆడ్తాడు. ఈ బద్ది దగ్గర్నుంచీ ఆ బద్ది దగ్గరున్న గోలీని ఒక కన్ను మూసుకుని, నాలిక కొరుక్కుంటా టకామని కొడ్తాడు ! వాన్తో గోలిగుండ్లాడి యెవురూ గెల్సలేరు. అందుకని ఆడకపోతే, ఉత్త గంప సూసుకొని వానికింకా కోపమొస్తాది. 'మొగోళ్ళయితే నాతో గోలిగుండ్లాటకు రాండి" అని సవాల్ జేస్తాడు.

అదీ కుదరకపోతే "అర్రెరేయ్ ! సావూ కొట్టూ ఆడదాం రండర్రా!" అని ఆశగా పిల్సుతాడు. సిన్న పెంకు బిళ్ళకు ప్యాడో, ఎంగిలో పూసి పైకెగరేస్తే, గుర్తు వుండే పక్క పడ్తే కొట్టు, ల్యాకపోతే సావు అన్నమాట. బుడంకాయ ఆ ఆటలో గూడా మోసం జేస్తాడు. మోసం కుదరకపోతే కావాలని కొట్లాట

1) గీతల తువాలు 2) శ్మశానం

పెట్టుకొంటాడు. అందుకని యెవ్వురూ ఆడకపోతే "పోంద్రా నా కొడుకుల్లారా, ఆడకపోతే నాకేం బయమా, బాయిలో పడ్తే లోతా?" అంటూ ... నిజంగా బయం లేదనుకోవాలని పాట పాడ్తాడు.

వాడింగా శానా శానా సెప్తావుంటాడు మల్ల. అసలు తెల్లవార్జామున ప్యాడ యేయగూడదంట. అదంతా దొంగ బరిగొడ్ల ప్యాడంట. సలికాలం వచ్చేతప్పటికి సేలల్లో పైరుంటాది గదా, ఊళ్ళో పెద్దోళ్ళు పైరుకు కాయిలి పెడ్తారు. అయితే కాయిలి పెట్నోళ్ళ నుంచే రాత్రిపూట బరిగొడ్లు పోయి పైరు మేసి సయగ్గాకుండా వస్తావుంటాయంట. అట్టా ఊళ్ళోళ్ల పైరు మేసొచ్చిన ఎనుముల్ని కట్టేసుకొని, అమ్మగారు సంబరంగా 'సుయ్ ! సుయ్'మని పాలు పిండుకొంటా వుంటారంట ! తెల్లవార్జాము ప్యాడకళ్ళు అట్టాటి దొంగ బరిగొడ్లయి కనుకనే మెడ యిరిగిపోయేంత బరువుగా వుంటాయట.

బుడంకాయగాడు ప్యాడ యేయలేదని కనిపెట్టిన వాళ్ళ రెడ్డెరి ఒకపారి సెలకోల తీసుకొని నెత్తురు సుక్క సిమ్మేట్టు కొట్టినాడు. అయినా వాడంతే ! ప్యాడ యేయకపోతే యింగా శానామంది పసుల్జీతగాళ్ళను కొట్టడం సెన్నుగాడు సూసినాడు. అప్పుడప్పుడూ పసుల్జీతగాళ్ళు ప్యాడ కోసం వాళ్లలో వాళ్లు తన్నుకొంటారు. ఒక్కోసారి వాళ్ళ కొట్లాట రెడ్డెర్ల దాకా పోతాది. వాళ్ళొచ్చి ఆకిరికి సేసేది ఎవురి పసుల్జీతగాన్ని వాళ్లు తన్నడమే !

ఈ జీతగాళ్లలో అప్పుడే అమ్మ పాలు మర్సిపోయినారేమో అనిపిచ్చే వాళ్ళు గూడా వుండారు. యీళ్ళు తెల్లవార్జామున ప్యాడకళ్ల కోసం పోతా వుంటే ఇండ్లల్లో రెడ్డెర్ల పిల్లోళ్ళు యెచ్చంగా పండుకోనుంటారు. యీ పసుల్జీతగాళ్ళను వాళ్ళ అమ్మా నాయనా జీతానికెందుకు పెడ్తారో ? అనుకొంటాడు సెన్నుగాడు. యాడాదికి మూన్నెళ్ళే పనులుంటాయి కనుక, బతక ల్యాక బాకీలు సేసుకొని తీర్చల్యాక పిల్లోళ్లను జీతాలకు పెడ్తారని వానికింకా తెల్దు. జీతానికి వచ్చిన మొదుట్లో వానికి ప్యాడా, రొచ్చూ తాకబుద్ధి కాలేదు, బరిగొడ్లు ప్యాడంతా తొక్కి సిందర బందర సేసుంటాయి. కసు వూడ్చేతప్పుడు అయి కదలవు. కొట్టి అదిలిస్తే..... సెడా మడా తిరిగి ఆ సందుట్లో సెన్నుగాని కాళ్ళు తొక్కినాయి. అప్పుడు వాడు 'అమ్మా' అని కూలబడిపోయి యేడుస్తావుంటే, బాలమ్మ వచ్చి "మల్లా తొక్కిచ్చుకుంటివా?" అని వాన్నే అర్సింది. ఇట్టా ఏడ్సుకొంటానే కసువూడ్సడం నేర్సుకొన్నాడు వాడు.

"సంకురాతిరి ఇంగా ఎన్నాళ్ళుంది ?" అని యెవురినన్నా అడిగితే 'ఓయమ్మా! శాన్నాళ్ళుంది' అనే మాట పోయి "ఇంగ పది రోజులే" అనే మాట యింటా వుండాడిప్పుడు సెన్నుగాడు. ఆ పది రోజులూ యింగా తిరిగి తిరిగి ప్యాడ యేసినాడు. దిబ్బ నిండి పొర్లిపోయింది. బాలమ్మ, ఆమె మొగుడు ఎంగట్రెడ్డీ పొద్దుటూరికి పోయి కొత్త గుడ్డలు గూడా తెచ్చినారు. అంతకు ముందు రోజు ఆమె "పిల్లోళ్ళకు కొత్త గుడ్డలు పట్టియ్యాల, మొగ పిల్లోళ్ళకైతే సినిగి పీలికలై పోయినాయి" అనడం సెన్నుగాడు యిన్నాడు.

పండగొచ్చింది. పిర్రల మీద అతుకేసి కుట్టిన బిర్రు నిక్కరూ, మోకాళ్ళు మునిగే సొక్కా సెన్నుగాని మీద ఇసిరేసింది బాలమ్మ. "ఉగాదికి కొత్తయి తెస్తాములే, యిప్పటికి యియ్యేసుకో. నిక్కరు సిన్నోనిదీ, సొక్కా పెద్దోనిదీ. యాడా పోలా, కొత్తయి వున్నెట్టే వుండాయి" అనె !